# దోమలపై యుద్ధం

## ఫాగింగ్, మందు చల్లడానికి డ్రోన్ వినియోగం

- ఫిర్యాదుల కోసం 'మై జీహెచ్ఎంసీ' యాప్
- సమాచారం అందిన వెంటనే ఫాగింగ్
- ప్రయోగాత్మకంగా మూడు డివిజన్‌లలో అందుబాటులోకి..


దోమలను పారదోలే డ్రోన్

బంజారాహిల్స్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వర్షాలు పడుతున్నాయి. సీజన్ ఇంకా రెండు నెలల పాటు ఉంది. ఈ సమయంలో దోమలు విజృంభించే అవకాశాలు ఉన్నాయి. ఈ క్రమంలో దోమల నివారణపై జీహెచ్ఎంసీ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఎప్పటికప్పుడు దోమల నివారణ కోసం ఫాగింగ్ చేస్తున్నా, ఇంకా కొన్నిప్రాంతాల్లో దోమల బెడద తీవ్రంగా ఉన్నట్లు జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం అధికారులకు, సిబ్బందికి రోజూ ఫిర్యాదులు అందుతున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని దోమల తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక యాప్ ద్వారా 'అభ్యర్థన పెట్టండి-ఫాగింగ్ చేస్తాం' అంటూ అధునాతన సాంకేతిక సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. మీ ఏరియాలో దోమల తీవ్రత ఎక్కువగా ఉందా? మా సిబ్బంది అక్కడ ఫాగింగ్ చేయడం లేదా? నివారణ చర్యలపై సిబ్బంది స్పందించడం లేదా? అయితే 'మై జీహెచ్ఎంసీ' యాప్‌లో అభ్యర్థన పెడితే వెంటనే ఎంటమాలజీ సిబ్బంది అక్కడికి వచ్చి ఫాగింగ్ చేస్తారంటూ ఈ అధునాతన సేవలను పౌరులకు వినియోగంలోకి తీసుకువచ్చారు. ఇందుకోసం యాప్‌లో ప్రత్యేకంగా 'రిక్వెస్ట్ ఆప్షన్'ను అందుబాటులోకి తెచ్చారు. ఈ సేవలను ప్రయోగాత్మకంగా జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్-18 పరిధిలో వినియోగంలోకి తెచ్చారు. ఈ సర్కిల్లో విజయ వంతమైతే గ్రేటర్ పరిధిలోని మిగతా సర్కిళ్లకు కూడా విస్తరించాలని ప్రణాళికలు రూపొందించారు.

### మూడు డివిజన్‌లకు అందుబాటులో..

సర్కిల్-18 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలో ఈ యాప్ ప్రస్తుతం అందుబాటులోకి తీసుకువచ్చారు. మీరు అభ్యర్థన పెడితే.. మేము ఫాగింగ్ చేస్తాం అంటూ అధికారులు పేర్కొంటున్నారు. ఈ యాప్‌లో ఫాగింగ్ చేయాలంటూ అభ్యర్థన పెట్టిన తర్వాత సంబంధిత అధికారులు, ఎంటమాలజీ సిబ్బంది స్పందించారా? అభ్యర్థించిన ప్రాంతంలో ఫాగింగ్ జరిగిందా? లేదా? అన్నది సాంకేతికంగా పర్యవేక్షించనున్నారు. జియో ట్యాగింగ్ చేసిన యంత్రాలు నిర్ధీత ప్రాంతాలు ఫాగింగ్ చేశాయా? లేదా? అభ్యర్థనను గాలికి వదిలేశాయా? అన్నది దీని ద్వారా తేలికగా తెలిసిపోతుందని జీహెచ్ఎంసీ వైద్య, ఆరోగ్య శాఖ విభాగం అధికారులు పేర్కొంటున్నారు. జూబ్లీ హిల్స్ సర్కిల్‌లో అమలు చేస్తున్న ఈ విధానంపై ఫలితాలు వచ్చిన తర్వాత ప్రజలు సంతృప్తి చెందినట్లు తెలిస్తే మిగతా ప్రాంతాలకు విస్తరించాలని తలపెట్టారు.

### ఫిర్యాదు ఎలా చేయాలంటే..

మై జీహెచ్ఎంసీ యాప్ తెరిచి అక్కడ ఇచ్చిన ఆప్షన్స్‌లో ఫాగింగ్‌పై క్లిక్ చేయాలి. దోమల నివారణ సేవల కోసం రిక్వెస్ట్ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. ఫాగింగ్ చేయాల్సిన ప్రాంతం వివరాలను తమ సెల్ ఫోన్‌లోని లొకేషన్, లొకేట్ ఆన్ మ్యాప్ ఆప్షన్ ఎంచుకోవాలి. అభ్యర్థించే వ్యక్తి పేరు, ల్యాండ్‌మార్క్, టెలిఫోన్ నెంబర్ తదితర వివరాలు ఇందులో నమోదు చేయాలి. క్షేత్రస్థాయిలో ల్యాండ్‌మార్క్ ఫొటోను తప్పనిసరిగా సబ్‌మిట్ చేయాలి. అనంతరం అభ్యర్థనను స్వీకరించినట్లు సెల్ నెంబర్‌కు మెసేజ్ వస్తుంది. వెంటనే ఈ అభ్యర్థన సంబంధిత అధికారికి వెళ్తుంది. ఆయన సిబ్బందిని అక్కడికి వెళ్లి ఫాగింగ్ చేయాలంటూ సూచిస్తారు. ఫాగింగ్ చేసినట్లు సదరు సిబ్బంది ఫొటోలు తీసి సదరు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని కూడా ఆదేశిస్తారు. సర్కిల్-18 పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంటమాలజీ అధికారులు కోరుతున్నారు.

### కుంటలు, చెరువులపై ప్రత్యేక దృష్టి

దోమలు అధికంగా ఉండే కుంటలు, చెరువులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించే పనికి శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా బంజారాహిల్స్ చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తీసే పనులు మొదలు పెట్టారు. అంతేగాకుండా డ్రోన్‌ల సాయంతో దోమలు వృద్ధి చెందకుండా మందులు కొడుతున్నారు. ఓపెన్ నాలా వద్ద కూడా క్రమం తప్పకుండా ఫాగింగ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



దోమల పట్ల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. దోమల వృద్ధి కేంద్రాలను గుర్తించి అక్కడ నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు పరిసరాలు శుభ్రపరిచేందుకు చర్యలు తీసుకోవాలి. చెరువులు, కుంటల విషయంలో జీహెచ్ఎంసీ ప్రత్యేక చొరవ తీసుకుంటుంది. డ్రోన్‌లు ఉపయోగిస్తూ మందులను చల్లుతున్నాం. ఎవరికైనా దోమల బెడద తీవ్రంగా ఉంటే జీహెచ్ఎంసీ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

\- గద్వాల్ విజయలక్ష్మి, మేయర్


ఆత్మీయ సమ్మేళనంలో రిటైర్డ్ గ్రే హౌండ్స్ కమాండోలు

## రిటైర్డ్ గ్రే హౌండ్స్ ఉద్యోగుల ఆత్మీయ కలయిక

బంజారాహిల్స్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ గ్రేహౌండ్స్ అధికారులంతా ఒకచోట కలిశారు. ఆనాటి ఉద్యోగ పరిస్థితులను, నాటి ముచ్చట్లను నెమరువేసుకున్నారు. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్.10లో సోమవారం 1989 5బీ యూనిట్‌కు చెందిన గ్రేహౌండ్స్ ఉద్యోగులు రిటైర్డ్ డీఐజీ గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో కలిశారు. ఈ సందర్భంగా గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతియేటా తాము కలుసుకొని ఆనందంగా గడుపుతామని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ కమాండెంట్లు అప్పల్‌రెడ్డి, సురేందర్, డీఎస్పీ రాజగోపాల్, అడిషనల్ ఎస్పీ కే.ఆర్‌కే.ప్రసాద్, కమాండెంట్ మనోహర్, అసిస్టెంట్ కమాండెంట్ పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బస్తీల్లో రోడ్ల నిర్మాణం చేపట్టండి


జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ వెంకటేష్

బంజారాహిల్స్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): బస్తీల్లో రోడ్లు శిథిలావస్థకు చేరి కనీసం నడిచేందుకు కూడా వీలు లేకుండా తయారయ్యాయని, వెంటనే కొత్తవి నిర్మించాలని కోరుతూ జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ సోమవారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ఫిలింనగర్‌లోని దుర్గాభవానీనగర్, దీన్‌దయాళ్‌నగర్ బస్తీల్లో రోడ్లు పూర్తిగా పాడయ్యాయని, కొత్త వాటి కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. మిగతా బస్తీల్లో నిధులు మంజూరు అయినప్పటికీ పనులు ఇంత వరకూ మొదలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఫుడ్ లైసెన్స్ మేళాను సద్వినియోగం చేసుకోండి

ఖైరతాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాల వ్యాపారం చేసే ప్రతీ ఒక్కరు ఫుడ్ లైసెన్స్‌ను ఎఫ్ఎస్ఎస్ఏఐ ద్వారా తీసుకోవాల్సిందే. దీనికోసం ఖైరతాబాద్ జోనల్ కార్యాలయం మొదటి అంతస్తులో ఈనెల 9న నిర్వహిస్తున్న లైసెన్స్ మేళాను వ్యాపారులందరూ సద్వినియోగం చేసుకోవాలని జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి సూచించారు. ఈ మేళా కోసం ఐదు సర్కిళ్లకు ప్రత్యేకంగా రెండేసి టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నామని, రూ.12 లక్షల నుంచి రూ.20 కోట్ల టర్నోవర్ ఉన్న వ్యాపారులందరూ జోనల్ కార్యాలయంలో దరఖాస్తులను అందజేసి లైసెన్స్ పొందాలని ఆయన సూచించారు.

## 8 గంటల పనివేళలను కాపాడుకుంటాం

పంజాగుట్ట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పనివేళలను కాపాడుకుంటామని సీఐటీయూ జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ ఆర్.అశోక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పోరేట్లకు అధిక లాభాలు కట్టబెట్టాలనే ఉద్దేశంతో తీసుకొచ్చిన పది గంటల పని వేళల జీవో 282 కాపీని సోమవారం మధురానగర్‌లో తగులబెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమణ, రమేష్, అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

బేగంపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు జెండాను ఆవిష్కరించి వేడుకల్లో పాల్గొన్నారు. సంఘం బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. బేగంపేటలోని లింక్ రోడ్డు బ్రిడ్జి వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద నాగేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో రాగాటి సత్యం, సుదర్శన్‌బాబు, నాగేష్, చిన్నా, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.30 కోసం మద్యం దుకాణం క్యాషియర్‌పై దాడి

- ఇద్దరి అరెస్ట్

బంజారాహిల్స్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మద్యం సీసాల కొనుగోలు విషయంలో రూ.30 అధికంగా తీసుకున్నాడనే కోపంతో ఓ యువకుడు రెచ్చిపోయి మద్యం దుకాణం క్యాషియర్‌పై పగిలిన సీసాతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్.36లోని ఎస్‌వీఎస్ వైన్స్‌లో భరత్ అనే యువకుడు క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 6న ఫిలింనగర్‌కు చెందిన జగదీష్, సత్యనారాయణ వచ్చి ఓ ఫుల్‌బాటిల్ కొనుగోలు చేసి వెళ్లిపోయారు. కొద్దిసేపటికి ఇద్దరు మరోసారి మద్యం దుకాణం వద్దకు వచ్చారు. తన వద్ద రూ.30 అదనంగా తీసుకున్నావంటూ జగదీశ్ గొడవకు దిగాడు. ధరలు పెరిగాయని చెప్పినా వినిపించుకోకుండా మద్యం మత్తులో హంగామా చేస్తూ అక్కడే ఉన్న ఓ మద్యం బాటిల్‌ను పగలగొట్టి భరత్‌పై దాడి చేశాడు. తీవ్రగాయాలైన భరత్‌ను మిగతా సిబ్బంది అపోలో ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు జగదీష్, సత్యనారాయణపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

## గంజాయి విక్రేత అరెస్ట్

- 450 గ్రాముల గంజాయి స్వాధీనం

హైదరాబాద్ సిటీ/పంజాగుట్ట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ గంజాయి విక్రయిస్తున్న యువకుడిని ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ అధికారులు అరెస్ట్ చేశారు. నల్గొండ జిల్లా వాడపల్లి లక్ష్మీపురం గ్రామానికి చెందిన సయ్యద్ రంజాన్ అలీ పంజాగుట్టలోని బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ గంజాయి విక్రయాలు చేస్తున్నాడు. ఏపీ పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన దాదు అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి, నగరంలో అధిక ధరకు విక్రయిస్తున్నాడు. ఇతడి దందాపై సమాచారమందుకున్న ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ బృందం నిఘా పెట్టింది. పంజాగుట్ట పిల్లర్ నెంబర్.1087 ఆటోస్టాండ్ వద్ద గంజాయి విక్రయించేందుకు వచ్చిన రంజాన్ అలీని ఎక్సైజ్ సిబ్బంది అరెస్ట్ చేశారు. అతడి నుంచి 450 గ్రాముల గంజాయి, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

## పట్టు చీరలు అపహరణ

అమీర్‌పేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కస్టమర్లుగా వచ్చి నిర్వాహకురాలి దృష్టి మళ్లించి రూ.90 వేల విలువ గల 10 పట్టు చీరలను ఐదుగురు మహిళలు అపహరించుకుపోయారు. ఈ సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సనత్‌నగర్ డివిజన్ స్వామి టాకీస్ రోడ్ అయ్యంగార్ బేకరీ సమీపంలోని లిఖిత శారీ సెంటర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 5న అపర్ణ శారీ సెంటర్‌ను నిర్వాహకురాలు తెరిచారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో కస్టమర్లుగా వచ్చిన ఐదుగురు మహిళలు చీరలు కొనుగోలు చేస్తున్నట్లుగా నమ్మించారు. కౌంటర్ వద్ద ఉన్న అపర్ణకు నలుగురు మహిళలు అడ్డంగా నిలబడగా, మరో మహిళ 10 చీరలను తన చీర పైకెత్తి రెండు కాళ్ల మధ్యన దాచేసింది. కొద్దిసేపటి తర్వాత చీరలు అంతగా నచ్చడం లేదని నిదానంగా వెళ్లిపోయారు. సాయంత్రం తన షాపులో ఉన్న చీరలను లెక్కించగా 10 చీరలు కనిపించలేదు. దీంతో అపర్ణ ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల్లో ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

## వృద్ధురాలు అదృశ్యం

యూసుఫ్‌గూడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వృద్ధురాలు అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడ అంబేడ్కర్‌నగర్‌కు చెందిన వృద్ధురాలు జి.పెంటమ్మ సోమవారం అమీర్‌పేటకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో ఆమె మనువడు సంతోష్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దేదీప్య

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం

- వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య

పంజాగుట్ట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్యవిజయ్ అన్నారు. సోమవారం సిద్ధార్థనగర్ పార్కు వద్ద రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో సిద్ధార్థనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు విజయ్ కుమార్, ఏఈ అవినాష్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ శేఖర్, మాజీ కార్పొరేటర్ శ్యామ్‌రావు ముదిరాజ్, స్థానిక నాయకులు వేణు, పూజారి బాలరాజు, పవన్ ముదిరాజ్, సత్యనారాయణ, రాజు, రాజేందర్, కృష్ణ, ఇస్మాయిల్, శారద, విజయగౌడ్, వాణి పాల్గొన్నారు.

## దశల వారీగా సమస్యల పరిష్కారం

- కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్‌యాదవ్

బంజారాహిల్స్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): దశల వారీగా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఎల్లారెడ్డిగూడ సుభాష్‌నగర్‌లో వరదనీటి పైప్‌లైన్ పనులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలిక సమస్యలపై దృష్టి సారించినట్టు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మనోజ్ యాదవ్, గణేశ్, బాబు, విజయ్‌యాదవ్ పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు చేయూత

ఎర్రగడ్డ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): స్కూల్ ఫీజు కట్టలేని విద్యార్థులకు గూడూరు ఫౌండేషన్ ద్వారా చేయూతనందిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ గూడూరు చెన్నారెడ్డి తెలిపారు. సోమవారం ఎర్రగడ్డలోని హోలీ క్రాస్ స్కూల్ విద్యార్థులకు నోటుపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కూల్ నిర్వాహకులు శివప్రసాద్, జ్యోతి, నర్సమాంబ, గూడూరు ఫౌండేషన్ సభ్యులు గూడూరు శ్రీధర్‌రెడ్డి, చింతపల్లి శోభారెడ్డి, శ్రీపూజ, మంజుల, విరల్, సద్గుణరెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.


క్రీడా ఉపకరణాలు పంపిణీ చేస్తున్న ధోనీ అభిమానులు

## అనాథాశ్రమంలో ధోనీ జన్మదిన వేడుకలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): భారత జట్టు మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ 44వ పుట్టినరోజు వేడుకలను అమీర్‌పేటలోని ఒక అనాథాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ వేడుకల్లో ఆశ్రమంలోని పిల్లల మధ్య కేక్ కట్ చేసి, ధోనీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 100కి పైగా పిల్లలకు అన్నదానం చేయడంతో పాటు వారికి బ్యాట్లు, బంతులు, షెటిల్స్, రాకెట్స్, చెస్, క్యారమ్‌బోర్డులను ధోనీ అభిమానులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు ఎంఎస్‌డీయన్స్ సభ్యులు బలుసు ప్రవీణ్, కిశోర్, శ్రీకాంత్, విల్సన్, నవీన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపీ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ ఓబుల్‌రెడ్డి స్కూల్, బంజారాహిల్స్ మెరీడియన్ స్కూల్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లోనూ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్.22, ఎన్.తాతారావు ఇంటి ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లోనూ విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

### గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో..

గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ కుందన్‌బాగ్, సీఎం రెసిడెన్సీ, సీఎం సెక్యూరిటీ, ఎర్రగడ్డ, శంకర్‌లాల్ నగర్, ప్రేమ్‌నగర్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లోనూ, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ మినిస్టర్ రోడ్డు, బేగంపేట సప్తగిరి టవర్స్, పంజాగుట్ట టోపాజ్ బిల్డింగ్, జయశంకర్ నగర్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లోనూ విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

# ప్రజాపాలనతో అనేక సమస్యలకు పరిష్కారం

- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్


సమస్యలు తెలుసుకుంటున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్లు సంగీతాయాదవ్, సీఎన్‌రెడ్డి

బంజారాహిల్స్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనతో అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. గాంధీభవన్‌లో సోమవారం జరిగిన ప్రజాపాలనలో కార్పొరేటర్లు వనం సంగీతాయాదవ్, సీఎన్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ పలు సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్న వారికి ప్రజాపాలన ఉపయోగకరంగా మారిందన్నారు. ప్రజాప్రతినిధులను నేరుగా కలవడమే కాకుండా సమస్యలను చెప్పుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. నియోజకవర్గంలోని కార్పొరేటర్లతో కలిసి ప్రతి పదిహేను రోజులకోసారి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేయనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


అదనపు కలెక్టర్ ముకుందరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

## ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి

ఖైరతాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు హైదరాబాద్ కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. సంఘం నగర అధ్యక్షుడు రాకేష్, ప్రధాన కార్యదర్శి హరీష్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. అదనపు కలెక్టర్ డాక్టర్ ముకుందరెడ్డికి సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.


హుండీలు లెక్కిస్తున్న అర్చక సిబ్బంది

## ఎల్లమ్మ ఆలయం హుండీ ఆదాయం

## రూ.87,24,602

అమీర్‌పేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ ఆలయం హుండీలను లెక్కించారు. 54 రోజులకు సంబంధించి 18 హుండీల ద్వారా రూ.87,24,602 ఆదాయం వచ్చినట్లు ఈవో మహేందర్‌గౌడ్ వెల్లడించారు. జనరల్ హుండీలలో రూ.86,18,047 రాగా, అన్నదానం హుండీలలో రూ.1,06,555 వచ్చాయి. అలాగే, 34 యూఎస్ డాలర్లు, 10 దీరామ్స్, 5 రియాల్స్, 10 పౌండ్స్, 20 థాయిలాండ్ కరెన్సీలు వచ్చాయి. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి పర్యవేక్షణలో ఉదయం 10 గంటలకు ప్రారంభమైన లెక్కింపు సాయంత్రం 6 గంటలకు ముగిసింది. కార్యక్రమంలో సంధ్యారాణి, ఈవో మహేందర్‌గౌడ్, చైర్మన్ సాయిబాబాగౌడ్, కనకదుర్గ ఆలయం ఈవో అంబూజ, ధర్మకర్తలు కొమ్ము రవీందర్, మిరియాల నవీన్‌రాజ్, గోదాస్ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

పంజాగుట్ట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి డిక్లరేషన్‌లో ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని, బీసీ-డీ గ్రూప్ నుంచి బీసీ-ఏ గ్రూప్‌లోకి మార్చిన తర్వాతనే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ పోరాట సమితి డిమాండ్ చేసింది. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమితి నాయకులు సుంకరబోయిన మహేష్, ఉప్పరవేణి రంజిత్ ముదిరాజ్, ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ తెలంగాణ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్, తదితరులు మాట్లాడారు. నీలం మధు ముదిరాజ్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని, పండుగ సాయన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, మహబూబ్‌నగర్ జిల్లాకు ఆయన పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సమితి నాయకులు అశోక్ ముదిరాజ్, రవి ముదిరాజ్, శేఖర్, చందు, రామచందర్‌తో పాటు వివిధ జిల్లాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న విజయారెడ్డి

## బ్యాగులు, నోటు పుస్తకాలు పంపిణీ

ఖైరతాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పీజేఆర్ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బ్యాగులు, నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. సోమవారం ఖైరతాబాద్ మార్కెట్‌లోని నిశుల్క్ ప్రభాత్ పాఠశాలలో ఫౌండేషన్ చైర్మన్ విజయారెడ్డి వీటిని పంపిణీ చేశారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నతస్థానాలకు చేరుకుని సేవా కార్యక్రమాలు చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మధురానగర్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

పంజాగుట్ట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ అసదుద్దీన్ అన్నారు. కాలనీ సంక్షేమ సమితి అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మహమ్మద్ అజారుద్దీన్‌ను కలిశారు. జి-బ్లాక్ పార్కులో బోరు వేయించాలని, సీసీ రోడ్లను నిర్మించాలని కోరారు. దీనికి ఆయన స్పందించారు. ప్రభుత్వ నిధుల నుంచి సోమవారం బోరు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు, హనుమంతరావు యాదవ్, గంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఉజ్జయినీ మహాకాళి బోనాలకు ఆహ్వానం

బేగంపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి ఆలయంలో జరిగే ఆషాడ బోనాల ఉత్సవాలకు సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోట నీలిమను ఈవో మనోహర్‌రెడ్డి సోమవారం ఆహ్వానించారు. అమీర్‌పేటలోని సాయిబాబా ఆలయంలో జరిగే గురుపౌర్ణమి ఉత్సవాలకు నీలిమను ఆలయ నిర్వాహకులు ఆహ్వానించారు.

# హైటెన్షన్ విద్యుత్ తీగల సమస్యను పరిష్కరించాలి


తెలంగాణ ట్రాన్స్‌కో చీఫ్ ఇంజనీర్ చిరంజీవికి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

బోరబండ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలోని బస్తీల్లో హైటెన్షన్ విద్యుత్ తీగల సమస్యను పరిష్కరించాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు దీపక్‌రెడ్డి డిమాండ్ చేశారు. 'సమస్యలపై పోరాటం' కార్యక్రమంలో భాగంగా పార్టీ కార్యకర్తలతో కలిసి సోమవారం ఆయన పాదయాత్ర చేసి ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా దీపక్‌రెడ్డి మాట్లాడుతూ హైటెన్షన్ విద్యుత్ తీగల కారణంగా తరచూ ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం, ఆస్తినష్టం జరుగుతున్నాయని తెలిపారు. ఆరోగ్యనగర్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర కార్మికనగర్ వరకు కొనసాగింది. అనంతరం విద్యుత్ విభాగం చీఫ్ ఇంజనీర్ చిరంజీవికి వినతిపత్రం ఇచ్చారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు తంగెళ్లపల్లి లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కొలన్ సత్యనారాయణ, చింటు, భరత్‌గౌడ్, రామకృష్ణ, రాంధారి బాబు, శ్రీనివాస్‌రెడ్డి, నగేష్, కిషోర్, విశాల్‌సింగ్, శంకర్, కాశీ, భాస్కర్, గణేశ్, అనిల్, గోపాల్, ప్రశాంత్, శ్యామ్, సౌభాగ్యలక్ష్మి, శివ, మహేందర్ పాల్గొన్నారు.

# ఫుడ్ లైసెన్స్ మేళా

## 9న సికింద్రాబాద్ జోన్ కార్యాలయంలో నిర్వహణ

సికింద్రాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఫుడ్ లైసెన్స్ తీసుకోకుండా ఇష్టారాజ్యంగా ఆహార పదార్థాల విక్రయాలు జరపడం, టిఫిన్ సెంటర్లు, కేఫ్‌లు, హోటళ్లు, రెస్టారెంట్లు తదితర కార్యకలాపాలు నిర్వహించే వ్యాపారులపై చర్యలు తీసుకోవడానికి జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోన్ అధికారులు సిద్ధమవుతున్నారు. దీనిలో భాగంగానే ఈ నెల 9వ తేదీన జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో టిఫిన్ సెంటర్లు, కేఫ్‌లు, హోటళ్లు, రెస్టారెంట్ల వ్యాపారులకు ఫుడ్ లైసెన్స్ మేళా నిర్వహించనున్నారు. ఈ మేళాకు హాజరైన వ్యాపారులకు దీనిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి, శీఘ్రగతిన ఫుడ్ లైసెన్స్‌లు జారీచేయాలని నిర్ణయించింది. సికింద్రాబాద్ జోన్‌లోని బేగంపేట్, సికింద్రాబాద్, ముషీరాబాద్, అంబర్‌పేట్, మల్కాజ్‌గిరి సర్కిళ్లకు చెందిన వ్యాపారులు ఈ మేళాకు హాజరై, నిర్ణీత డాక్యుమెంట్లతో దరఖాస్తు చేసుకుంటే, త్వరితగతిన ఫుడ్ లైసెన్స్ సర్టిఫికెట్ జారీ చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం సికింద్రాబాద్ జోన్‌లోని సికింద్రాబాద్, బేగంపేట్, ముషీరాబాద్, అంబర్‌పేట్, మల్కాజిగిరి సర్కిళ్లలో మొత్తం 15వేల మంది వ్యాపారులు ఫుడ్ లైసెన్స్‌లు కలిగి ఉన్నారు. వారిలో చిన్న వ్యాపారులు మొదలు పెద్ద వ్యాపారులు ఉన్నారు. కాగా వ్యాపారంలో అనిశ్చిత పరిస్థితులు, నిర్లక్ష్యం తదితర కారణాలతో చాలామంది ఫుడ్ లైసెన్స్ తీసుకోకుండానే వ్యాపారం నిర్వహిస్తున్నారు. తాజాగా తాము నిర్వహిస్తున్న ఫుడ్ లైసెన్స్ మేళా వల్ల మరో 2వేల వరకు వ్యాపారులు ఫుడ్ లైసెన్స్ తీసుకోవచ్చని అధికారులు భావిస్తున్నారు.

**తప్పనిసరిగా ఫుడ్ లైసెన్స్ తీసుకోవాలి**

జీహెచ్ఎంసీ చట్టం ప్రకారం ఆహార వస్తువులు, ఆహార పదార్థాలకు సంబంధించి జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్ యాక్టు-2006 సెక్షన్ 31 ప్రకారం లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. ఫుడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తే గరిష్ఠంగా ఐదు లక్షల రూపాయల వరకు జరిమానా, వ్యాపారాన్ని బట్టి జైలు శిక్ష కూడా ఉంటుంది. - జంగారెడ్డి, మల్కాజిగిరి సర్కిల్ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్


జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కార్యాలయం

## గాంధీ ఆస్పత్రి ఔట్ సోర్సింగ్‌కు జీతాలు చెల్లిస్తాం

- డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్

అడ్డగుట్ట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ఔట్ సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న 250 మంది కార్మికులకు, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలల నుంచి జీతాలు ఇవ్వకపోవటంతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'నాలుగు నెలల జీతాలులేవు' అనే శీర్షికకు స్పందించిన గాంధీ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్ స్పందిస్తూ గతనెల 19న జీవో వచ్చిందని వెంటనే ఔట్‌సోర్సింగ్ కార్మికులందరికి జీతాలు ఇవ్వటానికి ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


పారిశుధ్య కార్మికులకు కిట్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని

## పారిశుధ్య కార్మికులకు శానిటేషన్ కిట్‌ల పంపిణీ

మారేడుపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్యం నిర్వహణలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమైనదని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం మారేడుపల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన పారిశుధ్య కార్మికులకు శానిటేషన్ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించగలరని అన్నారు. కార్మికులు పారిశుధ్య విధుల నిర్వహణతో పాటు ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ దాకు నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ధనగౌడ్, శానిటరీ సిబ్బంది జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

**హోమానికి ఆహ్వానం**

వెస్ట్ మారేడుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం దక్కన్ మానవ సేవా సమితి, ఆర్య సమాజ్ ప్రతినిధులు 13న మహాకాళి ఆలయంలో నిర్వహించే హోమానికి హాజరుకావాలని కోరుతూ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ప్రతినిధుల సభ్యుల బృందం ఆహ్వానం అందజేశారు.

## ముగిసిన బ్రహ్మోత్సవాలు

రెజిమెంటల్‌బజార్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రెజిమెంటల్ బజార్‌లోని పాండురంగ విఠలేశ్వర వేంకటాద్రి ఆలయంలో వైభవంగా సాగిన బ్రహ్మోత్సవాలు ముగిశాయి. సోమవారం మహా పూర్ణాహుతి, చక్రస్నానం, శ్రీ పుష్పయాగం, దేవతోద్వాసన, సప్తావర్ణము పూజలు, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే స్వామివారికి పూజలు చేశారు. ఆలయ చైర్మన్ అల్లాడి గౌరిశంకర్, ఈఓ సత్యనారాయణ, కమిటీ సభ్యులు నందికంటి రవి, శ్రీనివాస్, కీర్తి వీరేష్, పరమేశ్వరి, రాజగోపాలచార్యులు పాల్గొన్నారు.పూజల అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న భానుక నర్మద

## కంటోన్మెంట్ అభివృద్ధే లక్ష్యం : భానుక నర్మద

తిరుమలగిరి జూలై 7 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద అన్నారు. సోమవారం కంటోన్మెంట్ బోర్డు 7వ వార్డు పరిధిలోని రవి కాలనీ, ఎస్సీ కాలనీ, లాల్ బజార్‌లోని శాస్త్రీనగర్‌లో లక్షలాది రూపాయలను వెచ్చించి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని అన్నారు. దీంతో పాటు కమ్యూనిటీ హాల్స్‌లో మెరుగైన వసతులు కల్పిస్తున్నామని, సమస్యల రహితంగా కాలనీలను, బస్తీలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. అదేవిధంగా బస్తీల్లో అంతర్గత రోడ్లలో సీసీ బీటీ రోడ్లను ఆధునీకరిస్తామని అన్నారు. కార్యక్రమంలో వార్డు-7 బీజేపీ అధ్యక్షులు పవన్‌కుమార్, సీనియర్ నాయకుడు ప్రశాంత్ ప్రభు, మనోహర్, శ్రీధర్ రెడ్డి, విశ్వనాథ్, శ్రీను, మహేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.


హుండీని లెక్కిస్తున్న కమిటీ సభ్యులు

## నల్లపోచమ్మ రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో హుండీ లెక్కింపు

తిరుమలగిరి జూలై 7 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి పెద్ద కమేలలోని నల్లపోచమ్మ, రేణుక ఎల్లమ్మ దేవాలయం హుండీని సోమవారం కమిటీ సభ్యులు ఎర్రోళ్ల రుక్మయ్య ఆధ్వర్యంలో లెక్కించారు. హుండీ లెక్కించగా రూ.7వేల పైచిలుకు ఆదాయం వచ్చింది. వాటిని దేవాలయం బ్యాంకు ఖాతాలో జమ చేశారు. దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని ఎర్రోళ్ల రుక్మయ్య తెలిపారు. హుండీ లెక్కింపులో లక్ష్మీపతి, అనీల్, రాకేష్, సురేష్, రఘు, నర్సింగ్, బాబురావు, క్రిష్ణా, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావుకు విజ్ఞప్తి చేస్తున్న తెలంగాణ ఉద్యమకారుల కమిటీ సభ్యులు

## ఇంటి స్థలాలు కేటాయించేలా చొరవ తీసుకోవాలి

- తెలంగాణ ఉద్యమకారుల విజ్ఞప్తి

తార్నాక, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం ఉద్యమకారులకు 250 గజాల చొప్పున ఇంటి స్థలాన్ని కేటాయించేవిధంగా చొరవ తీసుకోవాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుల కమిటీ సభ్యులు సోమవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావును తార్నాకలోని ఆయన నివాసంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల కమిటీ సభ్యులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఎన్నికలకు ముందు తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలాన్ని కేటాయిస్తామని ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల కమిటీ చైర్మన్ బండి రమేష్, సభ్యులు వెంకటేశ్ గౌడ్, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి ఘటోత్సవం



సోమవారం ఉజ్జయినీ మహాకాళి అమ్మవారి ఘటోత్సవంలో పాల్గొన్న మహాకాళి ఆలయ అనువంశిక ధర్మకర్త సురిటి రామేశ్వర్, వినోద్ తదితరులు.

\- సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి

## మానసికస్థితి సరిగాలేని వ్యక్తి అదృశ్యం


రవీందర్‌రావు (ఫైల్)

రాంగోపాల్‌పేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మానసిక స్థితి సరిగా లేని వ్యక్తి అదృశ్యమయ్యాడు. మహంకాళి ఏఎస్సై డేనియల్ తెలిపిన వివరాల ప్రకారం తార్నాకకు చెందిన దివ్యాంగుడైన యెరవెల్లి రవీందర్‌రావు (53) శుక్రవారం తన సోదరుడైన విజయేందర్‌రావు, డ్రైవర్ సత్యనారాయణలతో కలిసి సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళి అమ్మవారి దర్శనానికి వెళ్లాడు. దర్శనానంతరం ఆలయం బయటకు వచ్చే క్రమంలో తప్పిపోయాడు. ఆలయ పరిసర ప్రాంతాల్లో వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో అతడి సోదరులు విజయేందర్‌రావు, రాఘవేందర్‌రావు కలిసి మహంకాళి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రవీందర్‌రావు ఆచూకీ తెలిస్తే మహంకాళి పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాల్సిందిగా ఏఎస్సై డేనియల్ విజ్ఞప్తి చేశారు.

## పేదల వైద్య సేవలకు సహకారం

- ఎమ్మెల్యే పద్మారావుగౌడ్


లబ్ధిదారులతో ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్, కార్పొరేటర్లు

బౌద్ధనగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఉన్న పేదప్రజల వైద్యసేవలకు తమవంతు సహకారమందిస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. సోమవారం సీతాఫల్‌మండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 31మంది లబ్ధిదారులకు రూ.10లక్షల విలువచేసే సీఎం సహాయనిధి చెక్కులను, మరో ఇద్దరికి మూడు లక్షల యాభైవేల రూపాయల విలువ చేసే లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్ఓసీ) పత్రాలను కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, ప్రసన్నలక్ష్మీ, సునీతతో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు వైద్యం భారంగా మారిన దశలో వైద్య సేవలు చేయించుకునేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త రాజు సుందరం, మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, నాయకులు గరిగిపోగుల చంద్రశేఖర్, నవీన్‌చారి, బెజ్జంకి రాజేశ్, పాకసాయి, మేడిశెట్టి బాలాజీ, సునీల్‌ముదిరాజ్, మిట్టపల్లి బాబురావు, శైలేందర్, మనోహర్, రవి తదితరులు పాల్గొన్నారు.

**అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం**

వివిధ ప్రాంతాల్లో పాత ప్రభుత్వ గృహ సముదాయాలు శిథిలావస్థకు చేరినప్పటికీ అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వ్యవహరిస్తోందని సికింద్రాబాద్ నియోజకవర్గ శాసనసభ్యుడు తీగుళ్ల పద్మారావుగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. లాలాపేట చంద్రబాబునాయుడునగర్‌లో దశాబ్దాల క్రితం నిర్మించిన ప్రభుత్వ నివాస సముదాయాలు శిథిలావస్థకు చేరాయని, తరచుగా పైకప్పు పెచ్చులుడుతున్నాయని, సోమవారం ఈ తరహా సంఘటన చోటుచేసుకోవటంతో అందులో నివాసముండే వారు సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి మొరపెట్టుకున్నారు. అపాయకరంగా ఉన్న ఇళ్లను వెంటనే తొలగించాలని, కొత్త ఇళ్లను నిర్మించాలని ఆయన అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి చందనతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే స్థానికులకు హామీ ఇచ్చారు.

## ఉజ్జయినీ మహాకాళీ బోనాలకు ఆహ్వానం

బేగంపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళీ ఆలయంలో జరిగే ఆషాఢ బోనాల ఉత్సవాలకు సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోట నీలిమను ఈవో మనోహర్‌రెడ్డి సోమవారం ఆహ్వానించారు. అమీర్‌పేటలోని సాయిబాబా ఆలయంలో జరిగే గురుపౌర్ణమికి నీలిమను ఆలయ నిర్వాహకులు ఆహ్వానించారు.

## ఎల్లమ్మ ఆలయం హుండీ ఆదాయం రూ.87,24,602


హుండీలు లెక్కిస్తున్న అర్చక సిబ్బంది

అమీర్‌పేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ ఆలయం హుండీలను లెక్కించారు. 54 రోజులకు సంబంధించి 18 హుండీల ద్వారా రూ.87,24,602 ఆదాయం వచ్చినట్లు ఈవో మహేందర్‌గౌడ్ వెల్లడించారు. జనరల్ హుండీలలో రూ.86,18,047 రాగా, అన్నదానం హుండీలలో రూ.1,06,555 వచ్చాయి. అలాగే, 34 యూఎస్ డాలర్లు, 10 దీరామ్స్, 5 రియాల్స్, 10 పౌండ్స్, 20 థాయిలాండ్ కరెన్సీలు వచ్చాయి. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి పర్యవేక్షణలో ఉదయం 10 గంటలకు ప్రారంభమైన లెక్కింపు సాయంత్రం 6 గంటలకు ముగిసింది. కార్యక్రమంలో సంధ్యారాణి, ఈవో మహేందర్‌గౌడ్, చైర్మన్ సాయిబాబాగౌడ్, కనకదుర్గ ఆలయం ఈవో అంబుజ, ధర్మకర్తలు కొమ్ము రవీందర్, మిరియాల నవీన్‌రాజ్, గోదాస్ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.



## ఆలయ సందర్శన

13, 14 తేదీల్లో జరగనున్న బోనాల జాతరను పురస్కరించుకుని సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయాన్ని ఉత్తర మండల డీసీపీ రష్మీ పెరుమాళ్ సందర్శించారు. భక్తుల కోసం ఏర్పాటు చేయనున్న క్యూలైన్లు, ఇతర ఏర్పాట్లపై ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డితో చర్చించారు.

\- సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి

## ఘనంగా ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ వేడుకలు


మందకృష్ణ మాదిగను సత్కరిస్తున్న సీతాఫల్‌మండి బీజేపీ మాజీ అధ్యక్షుడు అంబాల రాజేశ్వరరావు, ఎంఎస్‌పీ కో-ఇన్‌చార్జి నందారం సీతారాం

బౌద్ధనగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, ఎమ్మార్పీఎస్ అధినేత, మహాజన సోషలిస్టు పార్టీ వ్యవస్థాపకుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు సోమవారం పార్శిగుట్ట కేంద్ర కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మందకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి, అనంతరం నాయకులు, కార్యకర్తల మధ్య కేకును కట్‌చేశారు. జాతీయ నాయకుడు రాగటి సత్యం మాదిగ, మహాజన సోషలిస్టు పార్టీ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి డప్పు మల్లికార్జున్ మాదిగ, విజయరావు, ఎంఎస్‌పీ సికింద్రాబాద్ కో-కన్వీనర్ నందారం సీతారాం, సీతాఫల్‌మండి డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు అంబాల రాజేశ్వరరావు తదితరులు మందకృష్ణమాదిగతో కేకు కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


శ్రీగణేష్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న అంబేద్కర్‌నగర్ బస్తీవాసులు

## నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

బోయినపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గం వార్డు-6 అంబేడ్కర్‌నగర్‌లో ఎన్నో ఏళ్ల నుంచి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో వల్ల బస్తీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని బస్తీ వాసులు ఎమ్మెల్యే శ్రీగణేష్ దృష్టికి తీసుకువెళ్లారు. దాంతో వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి బస్తీలో ఇటీవల పనులను ప్రారంభించి త్వరతగతిన పూర్తి చేయించారు. సోమవారం ఎమ్మెల్యే నివాసంలో కలిసిన బస్తీవాసులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బాలరాజు లక్ష్మి, పద్మ, శ్రీను, బాలు తదితరులు పాల్గొన్నారు.


దర్గా పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న జంపన తదితరులు

## దర్గా పునర్నిర్మాణ పనులు ప్రారంభం

సికింద్రాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): దర్గా పునర్నిర్మాణానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు కంటోన్మెంట్ 3వ వార్డు అంబేడ్కర్‌నగర్‌లో ప్రసి చెందిన గౌస్ ఈ ఆజామ్ దస్తగిర్ దర్గా పునర్నిర్మాణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా జంపన ప్రతాప్ హాజరయ్యారు. నాయకులు శ్యాంసన్‌రాజు, నరేష్, ఎం.డి.అస్గర్, ఎం.డి.అస్లాం, మహమ్మద్ రఫీక్, చందబాను, రాజు, శంకర్, దబ్బేటా శ్రీను, జగదీష్, ప్రశాంత్, పాండు తదితరులు పాల్గొన్నారు.

## గస్తీ పోలీసులు అప్రమత్తంగా ఉండాలి : డీసీపీ రష్మీ పెరుమాళ్


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రవీణ్‌ను పరామర్శిస్తున్న డీసీపీ రష్మీ పెరుమాళ్, ఏసీపీ గోపాల కృష్ణమూర్తి

బోయినపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : రాత్రివేళ గస్తీ నిర్వహించే పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు రక్షణ కల్పించేవిధంగా విధులు నిర్వర్తించాలని నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ అన్నారు. బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌కు చెందిన చంటి, ప్రవీణ్ అనే కానిస్టేబుళ్లు గస్తీ నిర్వహిస్తున్న సమయంలో గుర్తు తెలియని ఓ కారు రాత్రివేళ రోడ్డు పక్కన నిలిపి ఉంచడంతో అనుమానం వచ్చినవారు తనిఖీ చేయడానికి వెళుతున్న క్రమంలో వారి ద్విచక్ర వాహనాన్ని ఆ కారు(క్యాబ్) డ్రైవర్ ఢీ కొట్టి పారిపోయాడు. ఈ ఘటనలో ప్రవీణ్‌కు కాలు విరిగి తీవ్ర గాయాలు కాగా, చంటికి సైతం గాయాలయ్యాయి. ప్రవీణ్‌కు సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో సోమవారం వైద్యులు ఆపరేషన్ చేశారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రికి వెళ్లిన నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ ప్రవీణ్‌ను పరామర్శించరు. డీసీపీ మాట్లాడుతూ ఘటనకు కారణమైన క్యాబ్‌ను, డ్రైవర్‌ను సీసీ కెమెరాల ద్వారా గుర్తించినట్లు త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. బేగంపేట ఏసీపీ గోపాల్ కృష్ణమూర్తి, బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న దక్షిణాది జేఏసీ చైర్మన్ ప్రొ. గాలి వినోద్ కుమార్ తదితరులు

## ఎస్సీ వర్గీకరణ చట్టంలో సవరణ చేయాలి

తార్నాక, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాది రాష్ట్రాల్లో ఉన్న దళిత క్రైస్తవులకు లబ్ధి చేకూరేవిధంగా ఎస్సీ వర్గీకరణ చట్టంలో సవరణ చేయాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 17న హైదరాబాద్‌లో మేధోమధన సదస్సును నిర్వహించనున్నట్లు దక్షిణాధి జేఏసీ చైర్మన్ ప్రొ. గాలి వినోద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం తార్నాకలోని దక్షిణాది జేఏసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ఎస్సీ వర్గీకరణ చట్టం వల్ల 80 శాతం ఉన్న దళిత క్రైస్తవుల కంటే కేవలం 20 శాతం ఉన్న దళిత హిందువులకే ఎక్కువ లబ్ధి చేకూరుతుందన్నారు. దీనివల్ల 80 శాతం ఉన్న దళిత క్రైస్తవులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఇప్పటికైనా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని సవరించి దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దక్షిణాది జేఏసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బోయ శంకర్, చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి నుంకే సంపత్ పాల్గొన్నారు.


లాలాపేట్‌లోని బొడ్రాయి చౌరాస్తా నుంచి పోచమ్మ దేవాలయానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఉప్పొంగుతున్న మ్యాన్‌హోల్స్

## లాలాపేట్‌లో ఉప్పొంగుతున్న మ్యాన్‌హోల్స్

- రోడ్లపై పారుతున్న మురుగు నీరు
- పట్టించుకోని జీహెచ్ఎంసీ అధికారులు

తార్నాక, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యంతో డ్రైనేజీల గుండా పారాల్సిన మురుగు నీరు మ్యాన్‌హోల్స్ నుంచి ఉప్పొంగి రోడ్లపై ఏరులై పారుతుంది. లాలాపేట్‌లోని బొడ్రాయి చౌరాస్తా నుంచి పోచమ్మ దేవాలయానికి వెళ్లే ప్రధాన రహదారిలో నిత్యం మ్యాన్‌హోల్స్ నుంచి మురుగునీరు పొంగి రోడ్లపై పారుతుండటంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే విషయాన్ని పలుమార్లు జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కరించకపోవడంతో మురుగు వాసనతో ఇబ్బందులు ఎదుర్కోవడమే కాకుండా రోగాల బారిన పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజా ప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించేవిధంగా చర్యలు చేపట్టాలని స్థానిక నాయకుడు కుమ్మరి ఆంజనేయులు, శివరాం డిమాండ్ చేశారు.

## జెండా ఆవిష్కరణ



మాదిగ రాష్ట్ర పోరాట సమితి 31వ ఆవిర్భావ దినోత్సవం, అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని మెట్టుగూడ, దూద్‌బావిలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు దావ శివప్రసాద్, రాష్ట్ర నాయకులు బేకి సత్యనారాయణ, సీతారాం, కుమార్, గన్నంటి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

\- చిలకలగూడ, ఆంధ్రజ్యోతి

## రాజకీయాల కోసం స్కూళ్లను వేదిక చేయవద్దు

రెజిమెంటల్‌బజార్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో రాజకీయ పార్టీ ఆశావాహులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీల చిహ్నాలతో ముద్రించిన నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్నారని హైదరాబాద్ కలెక్టర్, డీఈఓలకు ఫిర్యాదు చేసినట్లు మోండా మార్కెట్ కార్పొరేటర్ కొంతం దీపిక తెలిపారు. ఈ విషయంపై సోమవారం సికింద్రాబాద్‌లోని డిప్యూటీ ఎడ్యుకేషన్ కార్యాలయంలో డివిజన్‌లోని ఎనిమిది పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజకీయాల కోసం పాఠశాలలను వేదికగా వినియోగించకుండా నిరోధించాలని అన్నారు.